# ఆకలిమంటలు

శ్రీమతి
గోపరాజు
సీతాదేవి

'తల్లీ! గుప్పెడు మెతుకులు. మూణ్ణాళ్లనుంచి కూడులేదు. నిలవలేక పోతున్నాను. కడుపుమంట. నీకు పుణ్యముంటుంది తల్లీ! నాల్గురోజుల పసిగుడ్డు. నెత్తురుముద్ద. పాల్లేవు. మీరు తినగా పారేసిన ఒక్క కబళం. ధర్మాత్మురాలివి, కనికరించు అమ్మా!'

టపీమని తలుపులు మూసుకుపోయాయి. నాల్గురోజుల కటికబాలెంత - చిరిగిపోయి, మాసిపోయి శరీరాన్ని సగం సగం కప్పుతూండే గుడ్డ పేలికలతో, నడి శీతాకాలం రాత్రి తొమ్మిదిగంటలవేళ ఎముకల్ని కొరికే ఆచలిలో వీధిఅరుగుక్రింద అడ్డమయిన కుళ్లూ కొట్టుకుపోతుండే సైడుకాల్వపక్కన ఆ అనాథమాత చతికిలబడిపోయింది—

* * *

కోలాహలంగా వుంది భోజనాల పందిరి. విరవని అప్పడాలకోసం కూర్చున్నారు పెళ్లివారు.

* * *

ఎంగిళ్లు పారబోసే కుండీనిండా కుప్పలుకుప్పలుగా ఎంగిలాకులున్నాయి. కొన్ని కిందపడి పొర్లాడుతున్నాయి. రెండు కుక్కలు గట్టిగా దెబ్బలాడుకుంటూ పంచుకుంటున్నాయి క్రిందపడ్డవాటిని.

కుప్పలుగాఉన్న ఆ విస్తళ్లుచూచేసరికి ఆకలితోటి కళవళపడుతూన్న ఆమె మొహం సంతోషంతోటి, సంతృప్తితోటి ఇంత అయింది. భరించ శక్యంగాని వాసనలతోటి, మట్టి కొట్టుకుపోయిన కొంగుపరచి, బిడ్డను ఒకచేత్తో పట్టుకుని, రెండోచేత్తో ఒక ఆకు శుభ్రపరిచింది. ఒక్కొక్క విస్తరి దొర్లించి అన్నం, పప్పుకూరలు, సగంసగం కొరికిన పిండివంటలు ఎంతో ఉత్సాహంతోటి పోగులుపెట్టుకో నారంభించింది. తనపిల్లలకి ఈవేళ కడుపునిండా కూడు - తనకి కడుపు నిండే పోయింది ఊహించుకోటంతోటి. అయ్యో, దిక్కుమాలిన కుక్కలు శనిగ్రహాల్లా మాటిమాటికి జోరబడి విసిగించాయి ఆమెని. ఇంక తాళలేకపోయింది. గబగబా, దొంతర్లుగా మూటకట్టి వెనక్కి తిరగకుండా చరచర నడిచిపోయింది—

ఆకలిమంటల విలయగర్జనలుచేస్తూ తీవ్ర అసహనంతోటి ఆ అమ్మిమీద మొరుగుతూనే ఉన్నాయి కుక్కలు చాలసేపు. కడుపుచిచ్చు తీర్చుకోటానికి, ఆఖరికి క్షుద్రజంతువులతోటి, పోటీపడుతోంది మనుష్యజాతి ఈ రోజున మానాభిమానాలు, నీతినియమాలు వమ్ముచేసి. అహో! దేవుని సంతానం!!

ఆకలిమంటలు! రక్తారుణితనేత్రాల్తో ఈ పీడిత దీనప్రపంచం నాగరిక సభ్యతా ప్రపంచాన్ని, నేటి సమాజ వ్యవస్థని ప్రశ్నిస్తోంది - సమాధానం ఏమిటి???